# ప్రస్థానం

(1988)

సూర్యుడిని తన దిశకు లాక్కుంటూ కాంతివంత మౌతోంది పడమటి ఆకాశం. పక్షులు కూడా బారులు బారులుగా పడమటి వైపుకే సాగిపోతున్నాయి.

తూర్పు కొండమీంచి ముసురు కొస్తున్న నల్ల మబ్బులు ఏను గుల గుంపుల్లా వున్నాయి. అంతవరకూ స్తంభించిన గాలికాస్త విసురుగా వీచడం మొదలు పెట్టింది.

ఇంటివైపు నెమ్మదిగా అడుగువేస్తూ నడుస్తూన్న రాఘవయ్య గుండె అవమానంతోనూ బాధతోనూ నిండి బరువెక్కింది.

జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నాడు.

మరెన్నో కష్టాల ననుభవించాడు. కానీ ఈ రోజు పొందిన అవమానాన్ని ఏనాడూ పొందలేదు.

రాఘవయ్య ఆలోచనలు గతానికీ వర్తమానానికీ మధ్య వూగిసలాడసాగేయి.

జీవితంలో తనకంటూ కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలను ఏర్పరచుకొని, వాటినే ఆచరించే మనస్తత్వం గలవాడు తను. అటువంటిది కారణాంతరాలవల్ల తన ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించాల్సి వచ్చింది. అనుకోని పరిస్థితుల్లో 'అప్పు' అనే వుచ్చులోకి యిరుక్కోవలసివచ్చింది

'మనిషనే వాడు ఆడిన మాట మీద నిలబడాలి అనేవాడు తను– ఈ రోజు తనే మాటమీద నిలబడలేక పోయాడు. ఇచ్చిన గడువు దాటితే అప్పిచ్చిన వాళ్ళు నిలదియ్యరూ? ఎన్నేళ్ళు కష్టపడితే వెనకెయ్యగలడు? ఏమైనా తన అశక్తతమీద తనకే అసహ్యమేసింది రాఘవయ్యకి. చాలీ చాలని చదువులూ, చాలీ చాలని జీతాలూ– ఎన్నటికీ ఎదగని జీవితాలు!

తనలా తన పిల్లలు కాకూడదు నిజానికి ఆ ఉద్దేశంతోనే తనీ పుచ్చులో ఇరుక్కున్నాడు.

ఈదురుగాలి శరీరానికి చల్లగా తగలడంతో తలెత్తి ఆకాశం వంక చూశాడు రాఘవయ్య. తూర్పు ఆకాశమంతా కారు మబ్బులతో నిండి వుంది. అక్కడా అక్కడా ఒకటీ అరా చినుకులు కూడా పడ్డం మొదలయ్యాయి.

ఎంత మారిపోయింది వాతావరణం! అనుకున్నాడు. అయినా అతని నడకలో వేగం హెచ్చలేదు. ఇల్లు చేరేసరికి పూర్తిగా తడిసి పోయాడు.

గుమ్మంలోకి అడుగు పెడుతుండగానే మాలతి ఎదురై 'అయ్యో' పూర్తిగా తడిసి పోయావేంటి నాన్నా. కాసేపు ఎక్కడన్నా ఆగక పోయావా, అంటూ తండ్రికి తువ్వాలందించింది.

రాఘవయ్య ఏంమాట్లాడలేదు. తడిసినబట్టల్ని దండెంమీదఆరేసుకున్నాడు.

తండ్రి ముఖంలోకి చూసిన మాలతి మరేం మాట్లాడలేక పోయింది. ఎప్పుడూ నవ్వుతూ వుండే ఆయన ముఖంలో గాంభీర్యత నిండివుండడం ఆమె కాశ్చర్యాన్ని కలిగించింది.

ఆ రాత్రి - మంచంమీద పడుకున్న రాఘవయ్యకు కంటిమీద కునుకురాలేదు; మనసంతా ఆలోచనలతో నిండిపోయింది. అనుకున్న దానికీ జరిగినదానికీ, ఆశించినదానికీ అనుభవించిన దానికీ. మధ్య ఎంత దూరం?

అతని ఆలోచనల్లో గడచిన సంఘటనలన్నీ తెరలుతెరలుగా కదిలాడసాగేయి.

ం ం ం

అనుకున్న విషయమే అయినా రాఘవయ్యకా వార్త అత్యంత

ఆనందాన్ని కలుగజేసింది- ఎంత బ్రతక లేక బడిపంతులు పనిచేస్తూ బీదబ్రతుకు బ్రతుకుతున్నా ఆ క్షణంలో అతని హృదయ సామ్రాజ్యంలో ఎగసిన సంతోష తరంగాలలో ప్రపంచాన్ని జయించిన గర్వం తొణికిస లాడింది. సరస్వతీదేవి తనకన్యాయం చేయలేదు. అది చాలు అనపించిందతనికి.

ఆ అనుభూతికీ, ఆనందానికీ కారణం శ్రీను పదో తరగతి పరీక్షలో ప్రథమ శ్రేణిలో పాస్ అవ్వడమే కాకుండా తొంభై రెండు శాతం మార్కులు సంపాదించుకుని స్కూల్లో రెండో స్థానంలో నిలవడమే.

తన పిల్లలు ప్రయోజకులై పెద్ద పెద్ద పదువులను నిర్వహిస్తారన్న నమ్మకం ఆనాడే గలిగిందాయనకు. దానికి తోడు ప్రతిభ గల విద్యార్థులకు అర్థికంగా చేయూత నివ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొంతమంది విధ్యార్థులకు స్కాలర్ షిప్‌లను ఇవ్వటానికి నిశ్చయించిందని తెల్సి మరింత ఆనందించాడు. ఏ రకంగా చూసినా శ్రీను మొదటి యాభై మంది విద్యార్థులలో ఒకడిగా ఎన్నికవుతాడనే నమ్మకం కలిగిందాయనకు. ఆ నమ్మకం ఆశగా కూడా మారింది. తెలివైన విద్యార్థుల చదువుకు ఆ మాత్రమైనా సాయపడదల్చుకున్నందుకు ప్రభుత్వాన్ని మనుసులోనే అభినందించాడు.

అయితే ఆ ఆశ ఇలా నిరాశగా మిగిలి తనలో ఆవేదనను రగిలిస్తుందని రాఘవయ్య ఎన్నడూ అనుకోలేదు.

పెద్దవాడు చక్రధరం చదువుకి చాలా ఖర్చయింది. చదువుకోసం పెట్టింది వృధాపోదనే వుద్దేశంతో తండ్రి ద్వారా సంక్రమించిన ఎకరా ముక్కనీ అమ్మేశాడు.— మిగిలింది, తలదాచుకునేందుకు ఒక పెంకుటిల్లు.

చక్రధరం తర్వాత పుట్టిన మాలతి చదువు టెంత్‌తోనే ఆగిపోయింది. చివరివాడు శ్రీను-

శ్రీనుని కాలేజీలో చేర్పించడనికి ఆర్థికంగా చాలా కష్టపడాల్సి వచ్చింది- ఫీజులూ, డోనేషన్లూ, పుస్తకాలూ, అన్నీ కలిపి వెయ్యి రూపాయల పై చిలుకైంది. అయినా వెనుదియ్యలేదు.

అయితే శ్రీనుతో పాటు తను కాలేజీకి వెళ్ళిన ఆ రోజు శాస్త్రి కన్పించి వుండకపోతే పరిస్థితులు ఎలా వుండేవో!

శాస్త్రి తన దగ్గర చదువుకున్నవాడు. ఇప్పుడా కాలేజీలో పాలిటిక్స్ లేక్చరర్‌గా పని చేస్తున్నాడు. తనంటే వల్లమాలిన గౌరవం.

"మీరు శ్రీను పై ఏ రకమైన ఆశలు పెట్టుకున్నారో చెప్పండి మాష్టారూ. దానికి కావల్సిన పునాది ఏర్పాట్లు చేసే పూచీనాది అన్నాడు- తనకేం అర్థంకాలేదా క్షణాన.

"మనమొకటి అనుకోడం, వాళ్లు మరొకలా తయారవడం జరుగుతున్నదే. నాకే విధమైన ఆశలూ లేవు. దేశంలో ఇంజనీర్లు, డాక్టర్లు మాత్రమే మానవ సేవ చేస్తున్నారనీ, నేననుకోను-" అన్నాడు, అలాకాదు మాష్టారూ, అన్ని మార్కులు తెచుకున్న విద్యార్థి కాబట్టి మనం అతని పై హోప్ వుంచుకోవచ్చు. ఈ రెండు సంవత్సరాలూ ట్యూషన్లు పెడితే అతని భవిష్యత్తు కాంక్రీటు పునాది అవుతుందని నా నమ్మకం అన్నాడు శాస్త్రి.

ఒక్కక్షణం తనేం మాట్లాడలేకపోయాడు-ప్రైవేట్లు పెట్టాలన్న ఆలోచన తనకేవాడూ కలగలేదు తన ఆర్థిక స్థితికూడ అందుకు అనువైనది కాదు.

"శ్రీను శ్రేయస్సు కోరి చెబుతున్నాడు మాష్టారూ. కాలేజీ చదువులు పూర్వంలా లేవిపుడు. క్లాసుల కొచ్చే విద్యార్థుల సంఖ్య నానాటికీ తక్కువై పోతోంది. వాళ్ళదృష్టి సినీమాల మీద రాజకీయాల మీద వుంటోంది. పోతే కొందరు లెక్చరర్లు కూడ అలాగే వున్నారనుకోండి. ఇంతకీ చెప్పేదేమిటంటే లెక్కలూ, సైన్సూ ప్రైవేట్లు సిస్ట

మేటిక్‌గా చెప్పేవారు నాకు తెల్సు అక్కడ చేరిస్తే మనకి చింత వుండదు. డబ్బుకాస్త ఎక్కువే అయినా హై ఫస్ట్‌క్లాసుగా రంటీ. మీరు నాకు తెల్సినవారు కాబట్టి మొత్తంమీద కొంత తగ్గేలా చూస్తాను. ఇదీ ఒకరకమైన డొనేషనే అనుకుంటారో మరేమనుకుంటారోగాని. తప్పదు. హై ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ కాబట్టి చెబుతున్నా- ఆర్డినరీ స్టూడెంటయితే మీకీ సలహా యివ్వను- అంటూ ఆగేడు.

రాఘవయ్యకు గుటక పడలేదు. ఈ పరిస్థితిని అంతకు ముందెన్నడూ ఊహించలేదు. చక్రధరానికి తనే రకమైన ప్రైవేట్లూ పెట్టించలేదు. కాకపోతే ఇప్పుడు రోజులు మారేయంటున్నాడు శాస్త్రి. శ్రీనుకి స్కాలర్ షిప్ వస్తే అదే అలా సర్దేయవచ్చు.

ఈ వారం రోజుల పాటు సుదీర్ఘంగా ఆలోచించిన మీదట శాస్త్రి ఇచ్చిన సలహానే పాటించా లనుకున్నాడు. స్కాలర్ షిప్ వచ్చేలోగా ఖర్చును ఏదో విధంగా భరించక తప్పదు అనుకున్నాడు. ఆ క్షణంలో అతనికి ప్రతి నెలా పదోతారీఖునే అప్పుజేసే గుర్నాథం మదిలో మెదిలాడు-అతని ద్వారా తనపని జరగొచ్చనుకున్నాడు.

అనుకున్నవి అనుకున్నట్టే జరిగాయి- నిట్టూర్చాడు. రాఘవయ్య శాస్త్రి ఆ సలహా ఇవ్వడం మంచిదే అయిందనిపించింది. చాలాసార్లు-

కాలేజీ ఎలక్షన్లు అచ్చుపుస్తకాల కొసం సిలబస్ తగ్గించటం కొసం స్టూడెంట్స్ వేసిన స్ట్రైకులూ, పండుగ సెలవలూ లెక్చరర్ల స్ట్రయికులూ పోగా సంవత్సరంలో కాలేజీ మూడు నెలలే పనిచేసినట్లు తేలింది. మూడు నెలల్లోనే సంవత్సరం చదువూ చెప్పిచేతులు దులుపుకుంది కాలేజీ. అంచేత ట్యూషన్లే విద్యార్థులకు గతి అయ్యాయి.

అంచేత శాస్త్రి సలహా ప్రకారం తను తీసుకున్న నిర్ణయానికి సంతోషించినా, రెండువేల రూపాయల అప్పు మాత్రం ఒక ప్రక్క పెరుగుతూ తనకు భారమౌతూనే వుంది. దానికి తోడు ఆ బాకీ తీర్చ

మని ఈనాడు అతగాడు నిలదీసి అడిగేసరికి నిజంగానే వళ్ళు చచ్చి పోయింది.

రాఘవయ్య ఆలోచనలు పెద్దకొడుకు చక్రధరం మీదికి పోయాయి. స్వయం కృషితో రాణించాడు చక్రధరం. మద్రాస్ ఐ. ఐ.టిలో చదివి ఉన్నత డిగ్రీ కోసం అమెరికా వెళ్ళేడు. వెళ్ళి సంవత్సరం దాటింది. నెలకో రెండు నెలలకో ఒక ఉత్తరం తప్పితే మరేం లేదు. ఒక్కొమారు తనుకొడుకు నించి ఆర్థిక సహాయాన్ని ఆశిస్తున్నాడా అనే అనుమానం కూడ కలిగేది. అయినా అందులో తప్పేముంది? వేలకువేలు ఖర్చుపెట్టి చదివించేడు. వెనుకనున్న పిల్లల కోసం ఆలోచించకుండా ఉన్న ఆస్తి కాస్తా అమ్మేశాడు.

పెద్దకొడుకుగా వాడికే తమ గురించి ఆలోచించి ఆదుకోవాల్సిన బాధ్యత వుంది. అది వాడు మరచిననాడు అవసర మనుకుంటే గుర్తు చేయడంతో తప్పులేదు—

రెండు వేల రూపాయలు చక్రధరానికి పెద్ద మొత్తమేం కాదు. కానీ తను నోరు తెరచి అడగ గలడా?

రెండో ఆట సినీమా వదిలిన అలికిడి వినిపిస్తోంది.

రాఘవయ్య ఆలోచనలు పరి పరి విధాల పోతున్నాయి. తొంభై రెండు శాతం మార్కులతో కాన్వెంట్ స్కూల్లో రెండవ వాడుగా వచ్చిన శ్రీనుకి ప్రభుత్వ స్కాలర్ షిప్ తప్పకుండా వస్తుందని అను కుంటున్నాడు.

స్కూలునుండి పిలుపొచ్చినరోజు మహదానందపడిపోయాడు. అయితే ఆ స్కాలర్‌షిప్ కోసం పెట్టుకునే దరఖాస్తుఫారం చూసి నిలువునా నీరయిపోయాడు.

తల్లి దండ్రుల నెలసరి ఆదాయం ఐదొందలు దాటిన విద్యా ర్థులకు ఆ స్కాలర్‌షిప్ స్కీము వర్తించదనీ, అట్టివారికి మెరిట్

సర్టిఫికేట్లతో బాటు ఓ వంద రూపాయలు బహూమతిగా యివ్వబడు తుందనీ అందులో వుంది.

రాఘవయ్యకు చాల నిరుత్సాహం కలిగింది. తెలివైన విద్యార్థులకు ప్రోత్సాహకరంగా అందించే ఆర్థిక సహాయాన్ని తండ్రి జీతంతో ముడి పెడ్తూ, అది అవసరమైన వారికి కూడా అందివ్వక పోవడం అన్యాయమన్పించింది. ఈ రోజుల్లో ఐదొందల రూపాయలు నెలసరి ఆదాయం లేకుండా పిల్లల్ని కాలేజీల్లో చదివించే వారున్నా రంటే నమ్మశక్యం కాలేదు- ఆ విధంగా చూస్తే ఆర్థిక స్తోమత లేని ప్రతిభ, అణగారి పోవలసిందేనా అన్పించింది.

ఆలోచిస్తే—అప్పట్లో చక్రధరం చెప్పిన మాటలే సత్య మన్పించేయి.

చక్రధరం విదేశం వెళ్తానంటే తను వ్యతిరేకించేడు. అప్పటి ఆలోచనలు వేరు! దేశంలోని ఇంజనీర్లూ, శాస్త్ర పరిశోధకులూ పై చదువులకోసం, ఉద్యోగాలకోసం, తమతమ సౌఖ్యాలకోసం విదేశా లకు వెళ్ళిపోయి ఆ దేశాలకు మాత్రమే ఉపయోగకరంగా స్థిరపడి పోతున్నారే తప్ప మాతృదేశానికి ఏ విధంగానూ సాయపడటం లేదన్న ఆవేదన వుండేది.

అలా వలస పోయిన మేధావుల సంఖ్య సంవత్సరానికి ఆరు వందలకు పైనే వుంటుందని లెక్కల్లో తేలింది. నిజానికి ఒక మేధావిని తయారు చేయడానికి ఏ దేశానికైనా కనీసం ఒక కోటి రూపాయలు ఖర్చవుతుంది. ఆ లెక్కన చూస్తే భారతదేశం ఎన్ని సంపన్న దేశాలకో ఎన్నో వేల కోట్ల రూపాయల మేరకు ఉచిత సహాయం చేస్తున్నట్లు.

మన దేశ మేధస్సును ఇతర దేశాలకు వినియోగించడం ఎంత వరకూ సబబు? మన దేశాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పరచా ల్సిన బాధ్యత మన మేధావులకు లేదా?

చక్రధరంతో తన వుద్దేశాన్ని ఎన్నో రకాలుగా చెప్పి చూశాడు అన్నిటినీ విని ఒక్క చిరునవ్వు నవ్వేడు చక్రధరం. ఆ నవ్వు తనకిప్పటికీ గుర్తే. 'నీదంతా చాదస్తం నాన్నా!' అనే అర్థం కన్పించిందా నవ్వులో.

"మేధావి వర్గం ఏ దేశానికో ఏ ప్రాంతానికో అంకితమైపోయి సంకుచితంగా ఆలోచిస్తే ఇప్పుడు మనం అనుభవిస్తున్న ఎన్నో సౌఖ్యాలు మనదాకా వచ్చేవి కావు నాన్నా. ఏ విద్యావంతుడైనా తనను గుర్తించి గౌరవించేవారి సన్నిధిలోనే వుండాలనుకుంటాడు, అది స్వార్థ పూరితమైనా సహజమైస ఆలోచనే. తననీ తనవారినీ సంరక్షించుకోలేని ఏ విద్యావంతుడూ దేశంకోసం ఆలోచించలేడు—ఎందుకో చక్రధరం మాటలు అప్పట్లో తన చెవికెక్కలేదు. "ఉన్నత విద్య నభ్యసించడం మేరకు నా కభ్యంతరం లేదు. అటుపై నీ ఇష్టం" అనేశాడు చివరికి. చక్రధరం ఆ మేరకు మాట ఇచ్చే వెళ్ళేడు. ఇప్పుడాలోచిస్తే చక్రధరం మాటల్లో నిజంలేక పోలేదనిపిస్తోంది.

ఎంతో డబ్బు ఖర్చు పెట్టి విద్య నభ్యసించిన విద్యార్థి తన విద్యను వికసింపజేసుకోడానికీ తన ప్రతిభను చాటుకోడానికీ అవసరమైతే దేశపుటెల్లలు దాటి వెళ్ళితే మాత్రం తప్పేముంది?

రాఘవయ్య మనసు ఎంతో పదునుగా ఆలోచించడం మొదలు పెట్టింది. తను కాదంటే మొదట్లో చక్రధరం ఎంత బాధ పడ్డాడో! కానీ ఎదురు తిరగలేదు- తన పిల్లలు తన మాటను కాదనరు- ఆ సంస్కారం పెద్దల ఎడ గౌరవం వారికుంది. రాఘవయ్య మనసు ఆర్ద్రమై అతని కళ్ళలో నీరు చేరింది.

అక్కడకు వెళ్ళాక రాసిన ఒకటి రెండు ఉత్తరాల్లో అక్కడ తన కెన్నో మంచి వుద్యోగాలొస్తున్నాయనీ కానీ తనమాట తీసుకొందే, అందుకు సాహసించలేననీ రాశాడు. కానీ తనే పట్టుదలగా

ఆ విషయాన్ని చాటిస్తూ వచ్చాడిన్నాళ్ళూ. కానీ ఇప్పుడు ఆలోచిస్తే వాడి ఆలోచనే సరియైనదనిపిస్తోంది. విజ్ఞుడైన కొడుకు ఒక్కోప్పుడు గురువుతో కూడా సమాన మవవచ్చు.

బాగా ఆలోచించాక ఒక నిర్ణయానికొచ్చాడు రాఘవయ్య. అప్పుడతని హృదయభారం కొంత తగ్గినట్లయింది. ఆ తర్వాత సంతృప్తిగా నిద్రలోకి ఒరిగి పోయాడు.

0 0 0

మర్నాడుదయం స్నానం, ధ్యానం అయ్యాక తన గదిలోకి వెళ్ళి చక్రధరానికి ఉత్తరం రాయడం మొదలు పెట్టేడు. ఇప్పటి తన నిర్ణయాలేమిటో అన్నీ నిర్మొహమాటంగా వ్యక్తపరచాలనుకున్నాడు. మేధావి వర్గం విశ్వజనీనత కోసం పాటు పడ్డంలో తప్పు లేదనీ శ్రీను చదువు విషయంలో కూడ ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోమనీ ఎన్నో రాయాలనుకున్నాడు. ఆ అభిప్రాయాలన్నీ సరిగా వ్యక్తం చేయడానికి ఇంగ్లీషే సరియైన భాష అనుకుని, 'మై డియర్ సన్....' అంటూ మొదలు పెట్టేడు.

ఆ క్షణంలో ఒక్కసారి కొడుకు పట్ల అభిమానం, ఆప్యాయతా పొంగుకొచ్చాయి రాఘవయ్యకి- అతని కళ్ళు ఆనందంతో తడిశాయి.

సరిగ్గా అదే సమయంలో ఇంటి ముందు సైకిలాపి, ఓ కవరందించాడు పోస్ట్‌మాన్.

ఆ కవరు పైనున్న దస్తూరీ చూడగానే రాఘవయ్య మనసు ఆనందంతో ఊగిపోయింది.

అది రాసింది చక్రధరం- వెంటనే ఆశ్చర్యపోయాడు-అందులో ఉత్తరంతోపాటు నాలుగువేల రూపాయలకు ఓ డ్రాఫ్ట్ వుంది.

ఆక్షణంలో ఆకాశం వంక చూసిన రాఘవయ్యకి వెలుగుల దేవుడైన సూరీడు తూర్పుదిక్కు- వదిలేసి పడమరకు పరుగిడుతున్నట్లు కన్పించాడు,

దినకరుని ఆ ప్రస్థానంలో యే కొంచరికో కాక; సకల ప్రాణి కోటికీ వెలుగందివ్వాలనే ఆరాటం కన్పించింది!